ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 08.10.2023 సమయం 1.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో అత్యాధునిక సంతాన సాఫల్య కేంద్రాన్ని హోంమంత్రి మహమూద్ అలీ ఈరోజు ప్రారంభించారు.

2. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అక్రమ మద్యం నిల్వ, రవాణా కట్టడిపై ఎక్సైజ్ శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ విభాగం దృష్టి పెట్టింది.

3. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాపై చర్చించేందుకు తెలంగాణ కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఢిల్లీలో సమావేశం అయింది.

4. అధునాతన వ్యవసాయంలో రైతులను ప్రోత్సహించడానికి కరీంనగర్ లో రేపటి నుంచి మూడు రోజుల పాటు కిసాన్ గ్రామీణ మేళా నిర్వహిస్తున్నారు.

--------------

**గాంధీ ఆసుపత్రి – హోం మంత్రి**

హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో అధునాతన సంతాన సాఫల్య కేంద్రాన్ని హోంమంత్రి మహమూద్ అలీ ఈరోజు ప్రారంభించారు. ఎలాంటి ఖర్చులేకుండా ఐవీఎఫ్ పద్ధతిలో సంతానం పొందే అవకాశం కల్పించినట్టు హోంమంత్రి చెప్పారు. 5 కోట్ల రూపాయలతో అత్యాధునిక ఐవీఎఫ్ చికిత్సలను అందుబాటులోకి తెచ్చామని, ప్రైవేటు ఆసుపత్రుల్లో లక్షల్లో ఖర్చయ్యే ఈ ప్రక్రియను గాంధీ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తారని మహమూద్ అలీ తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజారావు మాట్లాడుతూ... ఐవీఎఫ్ ప్రక్రియలో ప్రయోగశాల లోనే పిండాన్ని ఫలదీకరణం చేయించి అనంతరం మహిళ గర్భంలో ప్రవేశపెడతారని వివరించారు. (డెస్క్)

------------

**ఎక్సైజ్**

రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎక్సైజ్ శాఖ అప్రమత్తమైంది. ఆ శాఖ ఎన్ఫోర్స్మెంట్ విభాగం అక్రమ మద్యం, నిల్వలు, రవాణా కట్టడిపై దృష్టి సారించింది. ఇప్పటికే 29,663 మంది అనుమానాస్పద వ్యక్తులను ముందస్తుగా బైండ్ ఓవర్ చేసింది. 8,362 మంది నేర చరిత్ర ఉన్న రౌడీ షీటర్లపై నిఘా ఉంచింది. 14 మందిపై పీడీ చట్టం నమోదైంది. అంతర్రాష్ట్ర సరిహద్దు నిఘాను కూడా పటిష్టం చేశారు. 21 చోట్ల అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. సరిహద్దుల్లోని రైలు మార్గాల్లో నిఘా ఉంచేందుకు 13 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఎనిమిది చోట్ల, తెలంగాణ మహారాష్ట్ర మధ్య ఎనిమిది చోట్ల, తెలంగాణ-కర్ణాటక మధ్య నాలుగు చోట్ల, తెలంగాణ-ఛత్తీస్గఢ్ మధ్య ఒక చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. తనిఖీల్లో చిక్కితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. (DESK)

------------

**కాంగ్రెస్**

తెలంగాణ కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశం ఢిల్లీలో జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాపై ఈ కమిటీ చర్చిస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. అభ్యర్థుల జాబితాను ఖరారు చేసిన అనంతరం అధిష్ఠానానికి పంపిస్తారు. మంగళ, బుధ వారాల్లో

ఏఐసీసీ ఎన్నికల జాబితాను పరిశీలించినంతరం 14వ తేదీ లోపు అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.            (డెస్క్)

------------

**ఎరుకలు**

షెడ్యూల్డ్ తెగలలో వెనుకబడిన వర్గమైన ఎరుకల సంక్షేమానికి ప్రారంభించిన ఎరుకల సాధికారత పథకానికి ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం 60 కోట్ల రూపాయలు కేటాయించింది. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలను రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ఆర్థిక సహకార సంస్థకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన 543 కోట్ల రూపాయలలో ఎరుకల సాధికారత పథకానికి 60 కోట్ల రూపాయలు ప్రత్యేకించారు. రాష్ట్రంలో సుమారు లక్షన్నర మంది వరకు ఎరుకల జనాభా 13 జిల్లాల్లో ఉన్నారు. పందుల పెంపకం, బుట్టలు అల్లడం, ఎరుక చెప్పడం, చీపుర్ల తయారీ పై వారు జీవనం సాగిస్తున్నారు. (DESK)

------------

**రైళ్ళు**

రాష్ట్రం నుంచి నడిచే మూడు ఎక్స్ ప్రెస్ లు, ఒక ప్యాసింజర్ రైలు గమ్యస్థానాలను రేపటి నుంచి పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. జైపూర్ – కాచిగూడ నుంచి నడిచే జైపూర్ వీక్లీ ఎక్స్ ప్రెస్ ను కర్నూల్ వరకు పొడిగించారు. హాడష్సర్ – హైదరాబాద్ హడష్సర్ ట్రై వీక్లీ ఎక్స్ ప్రెస్ ను కాజీపూర్ వరకు పొడగించారు. నాందేడ్ – తాండూర్ – శర్బనీ డైలీ ఎక్స్ ప్రెస్ న  రాయ్ చూర్ వరకు, కరీంనగర్, నిజామాబాద్ – కరీంనగర్ డైలీ ప్యాసింజర్ ను బోధన్ వరకు పొడిగించారు. రేపు సికింద్రాబాద్ లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభిస్తారు. (డెస్క్)

------------

**కామారెడ్డి- షెడ్యూల్**

కామారెడ్డి జిల్లాలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. గాంధారి మండలం పోతంగల్ గ్రామానికి చెందిన కారంగుల సంతోష్ రెడ్డి ఆకాశవాణి తో చెప్పారు.

------------

**కరీంనగర్ మేళా**

అధునాతన వ్యవసాయంలో రైతులను ప్రోత్సహించడానికి కరీంనగర్ లో రేపటి నుంచి మూడు రోజులపాటు కిసాన్ గ్రామీణ మేళా నిర్వహిస్తున్నట్టు కిసాన్ జాగరణ అధ్యక్షుడు పి.సుగుణాకర్ రావు తెలిపారు. దాదాపు 70వేల మంది రైతులు ఈ మేళాకు హాజరౌతారని, వారికి వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై అవగాహన కల్పిస్తామని సుగుణాకర్ రావు ఆకాశవాణికి చెప్పారు. (పీటీసీ)

**......BYTE.......**

------------

**ఖమ్మం – పువ్వాడ**

ఖమ్మం జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో 6 కోట్ల రూపాయలతో నిర్మించే సింథటిక్ ట్రాక్ పనులకు రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. క్రీడాకారులకు కావలసిన అన్ని వసతులను ఖమ్మం జిల్ కేంద్రంలో అందుబాటులోకి తెస్తున్నామని ఆయన చెప్పారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.... ఖమ్మంలో అన్ని క్రీడాంశాలకు శిక్షణ అవకాశాలు ఉన్నాయని చెప్పారు.. జిల్లాలోని వైరా, కల్లురు, సత్తుపల్లి, మధిరలో మినీ స్టేడియంలను అందుబాటులోకి తీసుకువచ్చామని కూడా కలెక్టర్ చెప్పారు.

------------

**వైమానిక దళం**

భారత వైమానిక దళం ఈ రోజు 91వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రయాగ్ రాజ్ లోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్ బమ్రౌలిలో ఐఎఎఫ్ ఉత్సవ పరేడ్ ను నిర్వహించింది. చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వి ఆర్ చౌదరి ఈ సందర్భంగా

మాట్లాడుతూ, సృజనాత్మకత పెంపొందించు కోవడం ద్వారా కొత్తగా ఎదురవుతున్న సవాళ్లను దీటుగా ఎదుర్కోవాలని పిలుపు ఇచ్చారు. (NSD)

------------

**గోవర్ధన్ – కామారెడ్డి**

కామారెడ్డిలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 620 మంది మైనార్టీలకు లక్ష రూపాయల చొప్పున చెక్కులను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు అన్ని వర్గాల పేదలకు ఏదో ఒక పథకంలో సహాయం అందిస్తున్నారని ఆయన చెప్పారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ... ప్రభుత్వం అందించే సహాయంతో స్వయం ఉపాధి కల్పించుకోవాలని మైనార్టీలకు సూచించారు. మైనార్టీ కార్పోరేషన్ ఛైర్మన్ ఇంతియాజ్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ముజుబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. (పీటీసీ)

------------

**దివ్యాంగులు – సిరిసిల్లా**

రాజన్న సిరిసిల్లా జిల్లా సిరిసిల్లా నియోజక వర్గంలో మూడు చక్రాల సైకిళ్ల లబ్ది దారులకు జెడ్‌పీ ఛైర్ పర్సన్ ఎన్.అరుణ ఈరోజు వాహనాలు అందజేశారు. ఇప్పటి వరకు 370 మందికి మూడు చక్రాల సైకిళ్ళు అందజేశామని ఆమె చెప్పారు. (పీటీసీ)

------------

**కోర్టు**

జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ నియోజక వర్గ కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జీ కోర్టును మంజూరు చేస్తూ.... న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడిన తరువాత జనగామ కోర్టును జిల్లా కోర్టుగా అప్ గ్రేట్ చేశారు. ఇప్పటి వరకు స్టేషన్ ఘన్ పూర్ లోని కేసులను జనగామ జిల్లా కోర్టుకు బదిలీ చేస్తున్నారు. ఇప్పుడు జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు మంజూరు కావడంతో తిరిగి జనగామ కోర్టునుంచి కేసులు ఈ కోర్టుకు బదిలీ కానున్నాయి. (పీటీసీ)

------------

**నీట్**

ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) అండర్ గ్రాడ్యుయేట్ సిలబస్ ను తగ్గించారు. విద్యార్థులపై భారం తగ్గించడంలో భాగంగా నీట్-2024 నూతన సిలబస్లో నేషనల్ మెడికల్ కమిషన్ స్వల్ప మార్పులు చేసింది. ఈ ఏడాది నీట్ను 2024 మే 5న నిర్వహిస్తారు. (DESK)

------------

**మంచిర్యాల-అస్వస్థత**

మంచిర్యాల జిల్లా కన్నెపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో 8 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. రాత్రి భోజనం చేసిన విద్యార్థుల్లో 8 మంది వాంతులు, విరోచనాలు, తలనొప్పి తో ఈ ఉదయం అకస్మాత్తుగా కళ్లు తిరిగి కింద పడిపోయారు. వీరిని వెంటనే 108 అంబులెన్స్ లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో విద్యార్థినులకు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వీరందరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. (PTC)

------------

**ఫిష్ ఫెడరేషన్**

రాష్ట్రం లోని బీసీ గురుకులాల్లో విద్యార్థులకు భోజనంలో చేపల కూర అందించాలని ఫిష్ ఫెడరేష న్ నిర్ణయించింది. దసరా తర్వాత దీనిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని నిర్ణయించినట్టు ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ తెలిపారు. (DESK)

------------